క్లుప్తంగా

ఆలయంలో పూజలు



తునికి ఆలయంలో కొలువుదీరిన నల్లపోచమ్మదేవి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో పెద్దల అమావాస్య సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివ్వప్ప నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

హైవే ఫుట్‌పాత్‌పై పిచ్చి మొక్కలు



నర్సాపూర్- హైదరాబాద్ హైవే ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మంభోజిపల్లి వద్ద మెదక్-నర్సాపూర్ హైవే పక్కన ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు మొలిచాయి. కాలినడకన కోసం ఫుట్‌పాత్ ఏర్పాటు చేసినా పిచ్చిమొక్కలు మొలిచి నడవలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి నడిచేందుకు వీలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదానం

నర్సాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీయాదవ్ ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తన తల్లిదండ్రులు లక్ష్మమ్మ, రామయ్యల /జ్ఞాపకార్థం పిత్ర అమావాస్యను పురస్కరించుకుని అన్నదానం చేశానని తెలిపారు. ఆయన వెంట నాయకులు రమేష్‌గౌడ్, రాజేందర్, బుచ్చేష్ యాదవ్, రమేష్‌యాదవ్, రమణరావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ దీక్షాపరుల పూజలు



శివ్వంపేట(నర్సాపూర్): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాలధారణ స్వాములు చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దీక్షాపరులు గురుస్వాముల ఆధ్వర్యంలో హోమం, ఇతర పూజలు చేశారు. దీంతో ఆలయంలో సేవాలాల్ మహారాజ్ దీక్షాపరులతో సందడి నెలకొంది. 21 రోజుల మండల దీక్ష అనంతరం మహారాష్ట్రలోని పొరాదేవి ఆలయంలో మాల విరమణ చేపట్టనున్నట్లు సేవాలాల్ మహారాజ్ స్వాములు తెలిపారు.

ఎంగిలి పూల సంబురం

వైభవంగా పూల పండగ

ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక్క జాము ఆయె చందమామా.. అంటూ జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మను పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను పేర్చి స్థానిక దేవాలయాల్లో బతుకమ్మ పాటలతో సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



కౌడిపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శివ్వంపేట: కోదండరామస్వామి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నర్సాపూర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

శివ్వంపేట(నర్సాపూర్): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిమజ అన్నారు. మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో బేతని సంరక్షణ నిలయంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 20 మందికి ఆదివారం కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు అండగా ఉంటామన్నారు. ఇందులో భాగంగానే వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా 3 నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎపిక్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సాయంతో కుట్టుమిషన్లను అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా మార్కెట్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బేతని ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్, ఫాదర్ సెబాస్టియన్, సిబ్బంది కర్మెల, విన్సెంట్, వీరబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

దాతల కోసం ఎదురుచూపులు



వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తుడు

హవేళిఘణాపూర్(మెదక్): గతంలో బతుకమ్మ పండుగ వేళ మండలంలోని అన్ని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వీధి లైట్లు, రోడ్డు పరిశుభ్రత వంటి పనులు చకచకా జరిగేవి. అలాగే వీధివీధిలో లైట్ల వెలుగులతో సందడి కనిపించేది. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. కనీసం పంచాయతీలను కొనసాగించేందుకు సైతం నిధులు లేక పంచాయతీ సెక్రటరీలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఇప్పటికే వివిధ రకాల ఖర్చులు చేయగా.. ప్రస్తుతం అప్పులు చేసే పరిస్థితి లేదని లబోదిబోమంటున్నారు. కాగా, మండల పరిధిలోని సర్దనలో జగదాంబిక ఉత్సవ కమిటీ సభ్యులు ముందుకు వచ్చి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

రోడ్ల మరమ్మతుకు రూ.3 కోట్లు

- రేగోడ్‌కు రూ.16 లక్షలు మంజూరు
- త్వరలోను ప్రారంభంకానున్న పనులు

రేగోడ్(మెదక్): జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 8లక్షల 35వేలు మంజూరు చేసింది. ఈ మేరకు అత్యవసర నిధులు మంజూరవ్వగా.. త్వరలో మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందులో రేగోడ్ మండలానికి రూ.16 లక్షలు 67వేలు నిధులు మంజూరయ్యాయి. గజ్వాడ-గట్టుపల్లి రోడ్డుకు రూ.లక్ష 80వేలు, పట్టీపాలం తండా - సంగమేశ్వర తండా రూ.24వేలు, గౌట్టుముక్కుల-తిమ్మాపూర్ రూ.68వేలు, టి.లింగంపల్లి-దోసపల్లి రూ.లక్ష 38వేలు, జెడ్పీ రోడ్డు-చౌదర్‌పల్లి రూ.88వేలు, వెంకటాపూర్ రూ.61వేలు, ప్యారారం రూ.58వేలు, ప్యారారం-పట్టీపాలం తండా రూ.లక్ష 51వేలు, కొత్వాన్‌పల్లి-తిమ్మాపూర్ రూ.లక్ష 20వేలు, కొండాపూర్-లోక్యా నాయక్ తండా రూ.లక్ష 75వేలు, రంజానాయక్ తండా రూ.26వేలు, దోసపల్లి రూ.2లక్షల 48వేలు, కొత్వాన్‌పల్లి-బండ్రస్‌పల్లి రూ.లక్ష 80వేలు, దోసపల్లి-పట్టీపాలం తండా రూ.లక్ష 50వేలను మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరుకు సహకరించిన మంత్రి దామోదరకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిగతా గ్రామాలకు సైతం నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ డీఈ ప్రభాకర్ ఆదివారం మాట్లాడుతూ.. జిల్లాలో రూ.3కోట్లు మంజూరయ్యాయని, త్వరలో రోడ్లకు మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.



పట్టీపాలం తండా రోడ్డు

ప్రతి అమావాస్యకు అన్నదానం

మెదక్‌జోన్: పట్టణంలో పెద్దల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ద్వారక చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మ్యాడం బాలకృష్ణ రాందాస్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, సాయిరామ్, మధుసూదన్‌రావు, కొండ శ్రీను, ప్రదీప్, బాలరామ్, సల్మాన్, నవీన్‌చౌదరి, జాకీర్ ఉన్నారు.



అన్నదాన చేస్తున్న మ్యాడం బాలకృష్ణ

శాస్త్రీయ దృక్పథం అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం లోపించడం వల్లే మూఢనమ్మకాలు ఇంకా కొనసాగుతున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలరాజు అన్నారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, రాజకీయ పరిస్థితుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. సైన్స్, శాస్త్రీయ వైఖరులు పెంపొందించుటకు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, జిల్లా కోశాధికారి అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా?

- అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు పోలీసుల సూచనలు

వెల్దుర్తి(తూప్రాన్): దసరా పండుగను పురస్కరించుకొని ప్రతిఏడాది మాదిరిగానే ఈసారి కూడా పండుగకు పది రోజుల ముందే పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అయితే ఉపాధితోపాటు పిల్లల చదువులు, ఉద్యోగాల కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి వెల్దుర్తి, మాసాయిపేట తదితర మండలాల్లో నివాసముంటున్నారు. సెలవుల నేపథ్యంలో వీరంతా సొంతూర్లకు పయనమవుతుంటారు. అయితే ఇంటికి తాళాలు వేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు చర్యలతో చోరీ జరగకుండా చూడొచ్చని సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇంటికి తాళం వేసే ముందు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఆ ఇంటి యజమాని పూర్తి సమాచారమివ్వాలి. మీకు దగ్గరలో ఉండే బంధువులకు, స్నేహితులకు తెలపాలి. ఇంటికి సంబంధించిన అన్ని తలుపులు సరిగా వేశారో లేదో పరిశీలించుకోవాలి. అవసరమైతే ఎలక్ట్రానిక్ అల్లారం సిస్టం ఏర్పాటు చేసుకుంటే మంచిది. ఇంట్లో బంగారం, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.

ప్రమాదాల నివారణకు చర్యలు

పెద్దశంకరంపేట(మెదక్): బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలు పట్టణాల నుంచి తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు వివిధ వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో కొంతమంది బైక్‌లు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేస్తుంటారు. దీంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కావున పరిమితికి మించి ప్రయాణించవద్దని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే డ్రైవర్లు నియంత్రణ కోల్పోవడం, అధిక స్పీడుతో వెళ్లడంతో మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని హెచ్చరిస్తున్నారు.

ముందస్తు సమాచారం ఇవ్వాలి..



ముందస్తు సమాచారం ఇస్తే చోరీలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడతాం. రాత్రివేళల్లో పెట్రోలింగ్ పటిష్టంగా చేపడతాం. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజలు పోలీసుల సలహాలు, సూచనలు పాటించి సహకరించాలి.

– రాజు, ఎస్ఐ, వెల్దుర్తి

జాగ్రత్తలు పాటించాలి



పండుగల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి. వాహనాలను నెమ్మదిగా నడపడంతో పాటు బ్లాక్‌స్పాట్స్ వద్ద జాగ్రత్తగా వెళ్లాలి. పరిమితికి మించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించవద్దు. బైక్‌లు, ఇతర వాహనాలను నడిపే వారు మద్యం సేవించవద్దు.

– ప్రవీణ్‌రెడ్డి, ఎస్ఐ, పెద్దశంకరంపేట

చర్చి ఎన్నికల్లో అవకతవకలు



సీఎస్ఐ చర్చి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న చర్చి సభ్యులు

నర్సాపూర్: మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి పాస్టరేట్ కమిటీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని పలువురు చర్చి సభ్యులు ఆదివారం నిరసనకు దిగారు. చర్చి పాస్టరేట్ కమిటీ మాజీ సభ్యుడు రాజ్ కుమార్‌తో పాటు చర్చి సభ్యులు ప్రభాకర్, నవీన్, జయప్రకాష్, కిరణ్ తదితరుల ఆధ్వర్యంలో పలువురు చర్చి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 13న చర్చి పాస్టరేట్ కమిటీ ఎన్నికలు జరిగాయని, ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో కొంతమంది అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించి చర్చి సభ్యులను మభ్యపెట్టారని ఆరోపించారు. అంతేగాక చర్చి ఫాదర్, ప్రెస్‌బైటర్ ఇన్‌చార్జ్ రెవరెండ్ సందీప్‌కుమార్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి కొంతమందికి అనుకూలంగా ప్రచారం చేశారని రాజ్‌కుమార్, ప్రభాకర్ తదితరులు ఆరోపించారు. కాగా, ఈ ఆరోపణలపై చర్చి ఫాదర్, ప్రెస్‌బైటర్ ఇన్‌చార్జ్ సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా చర్చి నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించామని, ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండించారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

టేక్మాల్(మెదక్): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. మండలంలోని బొడ్మట్‌పల్లి ఛత్రపతి శివాజీయూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజులు పాటు నిర్వహించే ఉత్సవాల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు.

మండపాలు సిద్ధం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భవానీమందిర్, గడికోట, ఆర్యవైశ్యసంఘం, పలు యువజన సంఘాలతో పాటు కమలాపూర్, బుజ్రాన్‌పల్లి, జూకల్, బద్దారం, ఉత్తులూర్ తదితర గ్రామాలలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ఈ మేరకు మండపాలను విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరిస్తున్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని బగలాముఖీ, చండీలోని చండీకాంబ ఆలయంలో సోమవారం నుంచి 9 రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అలాగే పలు గ్రామాల్లో మండపాలను సిద్ధం చేశారు.

భక్తుల కొంగు బంగారం..

చిలప్‌చెడ్(నర్సాపూర్): భక్తుల కొంగు బంగారంగా చాముండేశ్వరి ఆలయం చిట్కుల్ గ్రామ సమీపంలో మంజీరా తీరాన వెలసింది. ఈ ఆలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మహాపూజ, మహానివేదన, హారతి తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.




చిట్కుల్ సమీపంలోని చాముండేశ్వరి ఆలయం



గర్భగుడిలో కొలువైన అమ్మవారు



శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠం



పెద్దశంకరంపేటలో ముస్తాబవుతున్న మండపం

పత్తికి వర్షం దెబ్బ..!

- ఇంకా నీటిలోనే పంటలు
- ఎండుముఖం పడుతున్న ఆకులు
- ఆందోళన చెందుతున్న రైతులు



ఏటిగడ్డ మాందాపూర్ శివారులో వర్షపు నీటిలోనే పత్తి పంట



పసుపు రంగులోకి మారిన పత్తి

కొల్చారం(నర్సాపూర్): పత్తి విత్తనాలు నాటినప్పటి నుంచి ఇప్పటివరకు ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మంజీరా తీరంలోని పొలాల్లో పత్తి పంట నీట మునిగి దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో పాటు మొక్కను రోగాలు ఆశిస్తుండడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలో వరి తర్వాత అత్యధికంగా పత్తి సాగు చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం.. మండల వ్యాప్తంగా గతేడాది 1,350 ఎకరాల్లో పంట సాగు చేయగా.. ఈ ఏడాది దాదాపు 2వేల ఎకరాలకు పైగానే పత్తి పంట సాగు చేశారు. ప్రధానంగా ఎనగండ్ల, ఏటిగడ్డ మాందాపూర్, కోనాపూర్, పైతర, తుక్కాపూర్ గ్రామాల్లో అత్యధికంగా పత్తి పంట సాగు చేశారు. అయితే పంట మొక్క దశలో ఉండగా.. వర్షం కురుస్తోంది. దీంతో పాటు కొంతకాలంగా కురుస్తున్న భారీ వర్షాలకు పువ్వు పెడుతున్న తరుణంలో రాలిపోయింది. దీంతో ఒక్కో మొక్కకు 10కి మించి పత్తి కాయలు కాయని పరిస్థితి నెలకొంది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా ఎడతెరిపి లేని వర్షాలతో పాటు వాతావరణంలో తేమశాతం పెరగడం కారణంగా మొక్క ఆకులు ముదురు పసుపు రంగులోకి మారి ఎండు ముఖం పడుతున్నాయి. మందులు పిచికారీ చేసిన వర్షం కారణంగా నియంత్రణలోకి రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మంజీరా పరివాహక ప్రాంతాల్లో పత్తి పంట నీటిలోని మునిగిపోయింది. దీంతో పత్తి మొగ్గలు కుళ్లిపోతున్నాయని వాపోతున్నారు. కావున తరచూ కురుస్తున్న వర్షాలకు పంట జాగ్రత్తలకు సంబంధించి వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన దాఖలు కనిపించడం లేదన్నారు.

ముడతలు పడుతున్నాయి..

ఈ ఏడాది రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. పువ్వు పెట్టే సమయంలో భారీ వర్షాలు కురిశాయి. ఈ భారీ వర్షాలతో మొగ్గ రాలిపోయి కాయలు పెట్టడం తగ్గింది. మళ్లీ రోగం వచ్చి ఆకులు ముడతలు పడుతున్నాయి. పలుమార్లు మందులు పిచికారీ చేసిన తగ్గడం లేదు. దిగుబడిపై దిగులుగా ఉంది.

– మల్లేశం, కోనాపూర్

సంక్షిప్త వార్తలు

పైపులైన్ లీకేజీతో తిప్పలు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో గ్రామానికి సరఫరా అవుతున్న నీటి పైపులైన్ లీకేజీ అయింది. ఈ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుంది. దీంతో గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. లీకేజీని సరి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడలం లేదని ఆలయ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా లీకేజీ ఉన్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి తొట్టిని వినియోగంలోకి తేవాలి

నర్సాపూర్: మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో నీటి తొట్టి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు. బతుకమ్మ పండుగ సమయంలో మహిళలు శివాలయం, లక్ష్మీనారాయణ ఆలయం వద్ద బతుకమ్మలు పేర్చి ఆడిన తర్వాత నీటి తొట్టిలో నిమజ్జనం చేసేవారని కాలనీవాసులు ప్రేంకుమార్, వాసు వివరించారు. కానీ నీటి తొట్టి ధ్వంసం కావడంతో బతుకమ్మ పండుగ సీజన్‌లో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేస్తున్నారని, ప్రజల ఇబ్బందులను గుర్తించి నీటి తొట్టి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరారు.

దొంతిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామ శివారు వాగులో నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగులో నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో దొంతి వాగులో పుష్కలంగా ఇసుక లభ్యత ఉందని, అందుకే తవ్వకాలు చేస్తున్నట్లు పలువురు గ్రామస్తులు వాపోయారు. అలాగే పలువురు వ్యాపారులు ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో మట్టిని తొలగించి ఇసుకను తయారు చేస్తున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే నివాళులు

శివ్వంపేట(నర్సాపూర్): మహాలయ అవామాస్య సందర్భంగా మండల వ్యాప్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి పేరిట బ్రహ్మణులకు నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ మేరకు మండల పరిధిలోని గోమారంలో ఉన్న ఆమె నివాసంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి దివంగతులకు నివాళులర్పించి పూజలు చేశారు.